

సోమశిలలో 9.01 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 9.013 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 891 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (పది గ్రాములు)	రూ.73,590
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,608
3 శాతం జీఎస్టీతో	రూ.6,807
సవర (8గ్రా)	రూ.54,456



వేడుకగా లక్ష మల్లెలార్చన

సంగం: స్థానిక కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో లక్ష మల్లెలార్చనను వేడకగా మంగళవారం నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చారు.

న్యూస్‌రీల్

వేదగిరిలో విశేషాభిషేకాలు



నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో విశేష పూజలను మంగళవారం నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం స్వాతిని పురస్కరించుకొని మూలవర్లకు అభిషేకం, తిరుప్పావై సేవను జరిపారు. ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ పీజీఈసెట్ ఫలితాల విడుదల

నెల్లూరు (టౌన్): ఏపీ పీజీఈసెట్ ఫలితాలను ఎస్వీ వర్సిటీ మంగళవారం విడుదల చేసింది. జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు వివిధ విభాగాల్లో రాష్ట్రస్థాయిలో ర్యాంకులను సాధించారు. కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో కోవూరుకు చెందిన కార్తీక్ 78 మార్కులతో రెండో ర్యాంక్, సివిల్ ఇంజినీరింగ్‌లో మైపాడు గేట్‌కు చెందిన నాగల ఉషాలక్ష్మి 70 మార్కులతో ఏడో ర్యాంక్‌ను పొందారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగంలో ఇందుకూరుపేట మండలం గంగపట్నం పల్లిపాళేనికి చెందిన వెయ్యల అమీషా 84 మార్కులతో ప్రథమ, ఫుడ్ టెక్నాలజీలో హరనాథపురానికి చెందిన అనసూరి గౌతమిప్రియ 74 మార్కులతో ఎనిమిది, మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన కొకటి పవన్‌కల్యాణ్ 68 మార్కులతో ఆరు, నానో టెక్నాలజీలో ఇందుకూరుపేట మండలం జంగంవానిదొరువుకు చెందిన ఆమలూరు జాన్‌డేవిడ్ 51 మార్కులతో ద్వితీయ ర్యాంక్‌ను దక్కించుకున్నారు.

మెడికల్ కళాశాలకు 24 పీజీ సీట్లు



మాట్లాడుతున్న వసుంధరాదేవి

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఈ ఏడాదికి తొలి దశలో జనరల్ మెడిసిన్‌లో 17, గైనకాలజీ విభాగంలో ఏడు పీజీ సీట్లు మంజూరయ్యా యని ప్రిన్సిపల్ డాక్టర్ వసుంధరాదేవి తెలిపా రు. దీనికి సంబంధించిన వివరాలను కళాశాలలో మంగళవారం ఆమె తెలియజేశారు. 68 పీజీ సీట్ల కోసం రూ.89 లక్షలను ఇండియన్ మెడికల్ కౌన్సిల్‌కు చెల్లించామని తెలిపారు. గతంలో కొన్ని వసతులు తక్కువగా ఉండేవని, అయితే ప్రస్తుతం వీటిని సమకూర్చామని చెప్పారు. పూర్తి స్థాయిలో ఫ్యాకల్టీ ఉన్నారని.. ఓపీ, ఐపీ సంఖ్య పెరిగిందన్నారు. ఈ క్రమంలో మిగిలిన పీజీ సీట్లు త్వరలో మంజూరు కానున్నాయని చెప్పారు. వీటి వల్ల రోగులకు మెరుగైన స్పెషాల్టీ వైద్యసేవలు అందుతాయని వివరించారు.

జిల్లాలో కేంద్ర బృందం పర్యటన నేడు

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించిన నష్టాలను అంచనా వేసేందుకు కేంద్ర బృందం బుధవారం పర్యటించనుంది. కేంద్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ సందీప్ శర్మ నేతృత్వంలో మన్ను ఉపాధ్యాయ్, మదన్‌మోహన్ మౌర్య పర్యటించనున్నారు. కలెక్టరేట్లోని శంకరన్ సమావేశ మందిరంలో వీడియో కాన్ఫరెన్స్‌లో సభ్యులు పాల్గొననున్నారు. వర్షాభావ పరిస్థితులతో కలిగిన నష్టాలపై ఏర్పాటు చేయనున్న ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించనున్నారు. కరువు నష్టాలను పవ ర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లా అధికారు లు వివరించనున్నా రు. మధ్యాహ్న భోజనం అనంతరం 1.30కు కలిగిరి మండలం గంగిరెడ్డిపాళెం చేరుకొని రైతులతో ముఖాముఖి మాట్లాడనున్నారు. అనంతరం తెల్లపాడు చేరుకొని క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. సాయంత్రం ఐదు గంటలకు కొండాపురం మండలం గొట్టిగుండాల లో పరిశీలించి ఒంగోలు పయనమవ్వనున్నారు.

అధ్యాపకులకు శిక్షణ

ఆత్మకూరు రూరల్: ప్రత్యేక నైపుణ్యాల్లో శిక్షణ పొందిన అధ్యాపకులు విద్యార్థులకు సరైన మార్గనిర్దేశం చేయాలని ఆర్జేడీ నిర్మల్‌కుమార్ పేర్కొన్నారు. ప్రత్యేక నైపుణ్యాలపై అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమాన్ని ఆత్మకూరు పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. నెల్లూరు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, ఆత్మకూరు ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, డాక్టర్ జీకేతో ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నిర్మల్‌కుమార్ మాట్లాడారు. ఎన్ఐటీ, చెన్నై సహకారంతో ఐదు రోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని వెల్లడించారు. ఐటీ యాక్ట్ కోర్సులతో విద్యార్థులు 4.0 ఇండస్ట్రీ, టెక్నికల్ ఎడ్యుకేషన్ తదితర అంశాల్లో నైపుణ్యం పొంది మంచి ఉద్యోగాలు పొందేందుకు అవకాశం ఏర్పడుతుందని చెప్పారు.

మునగ సాగు.. లాభాలు బాగు

గ్రామీణ ప్రాంతాల్లో మునగ సాగును పెంచేలా గత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉపాధి హామీ పథకం ద్వారా పెంపకాన్ని ప్రోత్సహించేందుకు శ్రీకారం చుట్టారు. దీన్ని అందిపుచ్చుకొని సన్న, చిన్నకారు రైతులు తమ పొలాల్లో వీటిని పెంచుతున్నారు. ఇప్పటి వరకు సుమారు వందెకరాల్లో సాగును చేపట్టారని తెలుస్తోంది. ఈ ప్రక్రియలో గుంతలు తీయడం మొదలుకొని మొక్కలు నాటాక రెండేళ్ల పాటు సంరక్షణ బాధ్యతనూ చేపట్టనున్నారు.

ఉపాధి నిధులతో పెంపకం

- రెండేళ్ల పాటు పరిరక్షణ
- మొక్కల కొనుగోలు, సంరక్షణకు ఎకరాకు రూ.1.08 లక్షలు
- సన్న, చిన్నకారు రైతులకు వరం
- ఎంపీడీఓ కార్యాలయాల్లో దరఖాస్తులు

నెల్లూరు(పొగతోట): మునగ సాగుతో రైతులు లాభాల దిశగా అడుగులేస్తున్నారు. దీనికి గత ప్రభుత్వం తోడ్పాటునందించడంతో సాగు చేపట్టేందుకు రైతులు ఉత్సాహం చూపుతున్నారు. మునగ మొక్కలను కొనుగోలు చేయడం.. నాటడం.. రెండేళ్ల పాటు సంరక్షణకు కలిపి ఎకరాకు రూ.1.08 లక్షలను వెచ్చిస్తున్నారు. ఈ మొత్తాన్ని ఉపాధి నిధుల ద్వారా చెల్లిస్తున్నారు.

ఎకరాకు 440 మొక్కలు

మొక్కలను కొనుగోలు చేసే బాధ్యతను రైతులకు అప్పగించారు. వీరికి అవసరమైన మేరకు కొనుగోలు చేసుకునే అవకాశం ఉంది. ఇలా ఎకరాకు 440 మొక్కలను పెంచనున్నారు. మూడో సంవత్సరం నుంచి మునగ చెట్లు కాపుకొస్తాయి. సన్న, చిన్నకారు రైతుల తమ పొలాల్లో మునగ చెట్లను ఉచితంగా నాటి సంరక్షిస్తున్నారు. దీనిపై రైతులకు అధికారులు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు.



రాపూరు మండలంలో సాగులో ఉన్న మునగ

అధిక శాతం మంది మొగ్గు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అధిక శాతం మంది రైతులు మునగను నాటేందుకు ముందుకొస్తున్నారు. అర్హులైన రైతులు ఎంపీడీఓ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హుల జాబితాను సిద్ధం చేయనున్నారు. తదనంతరం మునగ మొక్కలను నాటేందుకు అవసరమైన అనుమతి కోసం ప్రణాళికలను సిద్ధం చేసి ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయనున్నారు.

భారీగా గిరాకీ

మునగ కాయలు, మునగాకుకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లో గిరాకీ అధికం. ఒక మునగకాయను రూ.ఐదుకుపైగా విక్రయిస్తున్నారు. వీటిని గ్రేడింగ్ చేసి కిలోల్లెక్కన మార్కెట్లకు తరలించి విక్రయాలు జరుపుతున్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

దరఖాస్తు చేసుకోవడమిలా..

ఈ పథకానికి సన్న, చిన్నకారు రైతులు అర్హులు. నాలుగున్నర ఎకరాల్లోపు పొలం ఉన్న అన్నదాతలు ఆయా ఎంపీడీఓ కార్యాలయాల్లో భూములకు సంబంధించిన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి. గుంతలు తీయడం, మునగ మొక్కలు నాటడాన్ని ఉపాధి హామీ నిధులతో చేపడతారు. మొక్కల సంరక్షణ బాధ్యతను సైతం ఉపాధి నిధులతో రెండేళ్ల పాటు నిర్వహించనున్నారు. మూడో సంవత్సరం నుంచి మునగ కాయడం ప్రారంభమవుతుంది. అప్పటి నుంచి రైతులకు ఆదాయం లభించనుంది.

రైతులకు ఖర్చు లేకుండా మునగ చెట్ల పెంపకం

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ నిధులతో మునగ చెట్ల పెంపకానికి చర్యలు చేపట్టాం. సన్న, చిన్నకారు రైతులకు ఈ పథకం వర్తిస్తుంది. మొక్కలు నాటినప్పటి నుంచి రెండేళ్ల వరకు సంరక్షణకు నిధులను విడుదల చేస్తాం. ఎకరాకు 440 మొక్కలను కేటాయిస్తాం. మూడో సంవత్సరం నుంచి కాయలు కాయడం ప్రారంభమవుతుంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– వెంకట్రావ్, డ్వామా పీడీ

చాముండేశ్వరీదేవికి అశ్వవాహన సేవ



అమ్మవారి గ్రామోత్సవం

ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నం గ్రామంలో కొలువైన చాముండేశ్వరీదేవి ఆలయంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని అమ్మవారు అశ్వ వాహనంపై ఊరేగుతూ భక్తులను మంగళవారం కటాక్షించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. మేళతాళాల నడుమ ఊరేగుతున్న అమ్మవారికి గ్రామస్తులు వాకిళ్లలో ముగ్గులు వేసి, కర్పూర హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా వైశ్యులు వ్యవహరించారు. ఉదయం నిర్వహించిన చప్పరోత్సవానికి ఉభయకర్తలగా మూలగల ప్రదీప్‌- మాధవీ, పుల్లా విష్ణువర్ధన్‌రెడ్డి- మంజుల, సోమరాజుపల్లి కార్తీక సాయి- అంకిత దంపతులు వ్యవహరించారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో కోలాహలం నెలకొంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా అమ్మవారికి పులివాహన సేవను బుధవారం నిర్వహించనున్నారు.

మలేరియా నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశానికి హాజరైన అధికారులు



మాట్లాడుతున్న హరినారాయణన్

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): మలేరియాను 2027 నాటికి పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. సీజనల్ వ్యాధుల నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యలపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్లోని ఎస్సార్ శంకరన్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. మలేరియా, డెంగీ, మెదడువాపు తదితర వ్యాధులు ప్రబలకుండా చేపట్టాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలని చెప్పారు. మలేరియా కేసులను గుర్తించే ప్రక్రియను మెరుగుపర్చాలని చెప్పారు. ర్యాపిడ్ పరీక్షల్లో పాజిటివ్ వస్తే నిర్ధారిత టెస్టులను తప్పక చేయాలని ఆదేశించారు. అన్ని ల్యాబ్‌లలో రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. నీటి గుంతల్లో దోమల లార్వాలు వృద్ధి చెందకుండా గంబూసియా, గుప్పి చేపలను వదిలాలని తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాల్టీలలో ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రపర్చాలని చెప్పారు. వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, మెప్మా పీడీ రవీంద్ర, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగేశ్వరరావు, బీసీ, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు వెంకటయ్య, పరిమళ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద పులిని వాహనం ఢీకొనలేదు

- వార్తల్లో ఎలాంటి నిజం లేదు
- జిల్లా అటవీ శాఖ అధికారి చంద్రశేఖర్



వివరాలను తెలియజేస్తున్న చంద్రశేఖర్

నెల్లూరు(అర్బన్): ఆత్మకూరు రేంజ్ పరిధిలోని కదిరినాయుడుపల్లి అటవీ ప్రాంతంలో పెద్ద పులిని వాహనం సోమవారం ఢీకొందనే వార్తల్లో నిజం లేదని జిల్లా అటవీ శాఖ అధికారి ఆవుల చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు వేదాయపాళెంలోని అటవీ శాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రమాదంపై తాము పూర్తి స్థాయిలో ప్రాథమిక దర్యాప్తు చేశామని చెప్పారు. కారు ఇనుప బంపర్ 13 సెంటీమీటర్ల మేర వీ ఆకారంలో వంగిపోయిందని, అంతటి బంపర్ తగిలితే పులి ఎగిరిపడి ఉండాలని తెలిపారు. పులి ఎముకలు విరిగి అక్కడే కూలిపోవాలని, అయితే అలాంటిదేమీలేదని, ఎలాంటి రక్తపు మరకలూ లేవన్నారు. శ్రీశైలం నుంచి శేషాచలం వరకు ఉన్న అటవీ ప్రాంతంలోని ఆత్మకూరు రేంజ్ అడవుల్లో పెద్దపులి సంచరిస్తోందనే అంశాన్ని ఏడాది క్రితమే నిర్ధారించామన్నారు. ఇప్పుడు సంభవించిన ప్రమాద ప్రాంతంలో సమీపాన ఉన్న పులి పాదముద్రలు, గతంలో తాము సేకరించిన పాదముద్రలు ఒకటి కావని నిర్ధారించామన్నారు. ప్రమాదం జరిగిన చోట మట్టితో కూడిన చిన్న వెంట్రుకలు లభించాయని, దీన్ని ల్యాబొరెటరీకి పంపామని తెలిపారు. వాహన డ్రైవర్, అందులో ప్రయాణిస్తున్న వారిని ప్రశ్నించగా.. పులి ముందు భాగాన్ని చూడలేదని, చారలను మాత్రమే గమనించామని చెప్పారన్నారు. ఈ నేపథ్యంలో డ్రోన్‌తో తాము నాలుగు బృందాలతో అడవిలో గాలిస్తున్నామన్నారు. వన్యప్రాణుల అరుపులు ఎక్కడా వినిపించలేదని చెప్పారు. వారం పాటు కూంబింగ్‌ను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. అది ఏ తరహా జంతువో త్వరలోనే తెలుస్తుందన్నారు. ప్రజలు భయాందోళనలకు గురికావొద్దని, అడవుల్లోకి మాత్రం వెళ్లొద్దని కోరారు. మేకలు, గొర్రెల పెంపకందారులు జాగ్రత్తగా ఉండాలని, గుంపులుగా మాత్రమే పొలాలకు వెళ్లాలని కోరారు. వన్యప్రాణులను వేటాడినా, హింసించినా వైల్డ్ లైఫ్ యాక్ట్ – 1972 మేరకు కఠిన చర్యలు చేపడతామన్నారు. నెల్లూరు రేంజర్ మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.



గాలింపు చర్యల్లో పాల్గొన్న సిబ్బంది, అధికారులు

అడవిలో జల్లెడ

ఆత్మకూరు రూరల్: పెద్ద పులి కోసం అడవిలో జల్లెడ పడుతున్నారు. జిల్లా అటవీ కార్యాలయం నుంచి డ్రోన్ కెమెరాలను తెప్పించి 30 మంది అటవీ శాఖ సిబ్బంది పులి జాడ కోసం శ్రమిస్తున్నారు. అయితే పులి పాదముద్రలు.. ఇతర ఆనవాళ్లు గానీ తమకు లభించలేదని ఆత్మకూరు ఎఫ్‌ఆర్వో రావు శేఖర్ తెలిపారు. కదిరినాయుడుపల్లి డీఆర్వో రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేరాలను కట్టడి చేయాలి



మాట్లాడుతున్న ఆరిఫ్ హఫీజ్

- ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

నెల్లూరు(క్రైమ్): బీట్ వ్యవస్థను పటిష్టం చేసి నేరాలను కట్టడి చేయాలని ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆదేశించారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోగల మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ను మంగళవారం ఆయన నిర్వహించారు. నేర నియంత్రణ, సబ్ డివిజన్ పరిధిలో నేర సమీక్షల నిర్వహణ, ఈవ్‌టీజింగ్, విజిబుల్ పోలీసింగ్, ట్రాఫిక్ నిబంధనల అమలుపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ఈవ్‌టీజింగ్‌పై స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు ముగిసే సమయం సాయంత్రం నాలుగు నుంచి రాత్రి ఏడు గంటల వరకు విజిబుల్ పోలీసింగ్‌ను తప్పక నిర్వహించాలని ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్, నంబర్ ప్లేట్లు, పత్రాల్లేని వాహనాలపై కొరడా ఝళిపించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ఈ – చలానాల ద్వారా జరిమానాలను విధించాలన్నారు. సబ్ డివిజన్ అధికారులు తమ పరిధిలోని పోలీస్ అధికారులతో నేర సమీక్షలు నిర్వహిస్తూ గ్రేవ్ కేసులను తగ్గించాలని ఆదేశించారు. జూన్ 29న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని కేసులను పరిష్కరించాలని చెప్పారు. గతంలో జరిగిన నేరాల ఆధారంగా బీట్లను పునర్వ్యవస్థీకరించి తదనుగుణంగా బీట్లను నిర్వహించాలని సూచించారు. ఏఎస్పీలు ప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల పూర్వవైభవానికి కృషి

నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధి, పునర్నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి సారించి.. పూర్వవైభవానికి కృషి చేస్తామని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. సంతపేటలోని తన నివాసంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రధాన ఆలయాలను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. దేవదాయ శాఖలో ప్రక్షాళన చేపట్టి సమూల మార్పులకు శ్రీకారం చుట్టనున్నామని వివరించారు. అనేక ఆలయాలకు వందలెకరాల్లో భూములు, ఆస్తులు ఉన్నా, అభివృద్ధికి నోచుకోకుండా ఉండిపోయాయని చెప్పారు. ఇలాంటి వాటిని గుర్తించి దేవాలయాల ఆస్తుల పరిరక్షణకు చట్టప్రకారం చర్యలు చేపట్టనున్నామని వెల్లడించారు. ఆలయాలను అభివృద్ధి చేసి ఆధ్యాత్మిక భావనను పెంపొందించి.. హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయడమే ప్రధాన లక్ష్యమన్నారు.



మాట్లాడుతున్న రామనారాయణరెడ్డి

నూతన రైళ్లను ప్రవేశపెట్టాలి

గూడూరు రూరల్: విజయవాడ నుంచి ప్రధాన పట్టణాలకు నూతన రైళ్లను ప్రవేశపెట్టేలా చూడాలని సౌత్ సెంట్రల్ మజ్దూర్ యూనియన్, విజయవాడ డివిజన్ జనరల్ సెక్రటరీ శంకర్రావ్ కోరారు. ఈ మేరకు పట్టణంలోని రైల్వేస్టేషన్లో సంఘ నేతలతో మంగళవారం సమీక్షించిన అనంతరం ఆయన మాట్లాడారు. సౌత్ కోస్ట్ రైల్వే డివిజన్‌ను త్వరగా ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని కోరారు.

ఇటీవల బోగోలు మండలంలోని శ్రీవెంకటేశ్వరపాళెం రైల్వే స్టేషన్ సమీపంలో చెన్నై వైపు వెళ్లే మార్గంలో గుర్తుతెలియని వ్యక్తులు సిగ్నల్ ట్యాంపరింగ్ చేయడం ద్వారా ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌ను నిలిపివేసి ఎస్–11, ఎస్–13 బోగీల్లోకి ప్రవేశించారు. ఇద్దరు మహిళా ప్రయాణికుల మెడల్లోని బంగారు గొలుసులు, బ్యాగ్‌లు చోరీ చేసి పారిపోయారు. ఈ ఘటన జరిగిన 20 నిమిషాల తర్వాత అదే మార్గంలో వచ్చిన తిరుపతి స్పెషల్ ట్రైన్‌ను నిలిపేసి ఎస్–3, ఎస్–5 కోచ్‌లలోకి ప్రవేశించారు. ఇద్దరు మహిళా ప్రయాణికుల మెడలోని బంగారు గొలుసులు, బ్యాగ్‌లు అపహరించారు. అడ్డుకునేందుకు ఓ ప్రయాణికుడు ప్రయత్నించగా రాళ్లతో దాడి చేసి గాయపరిచారు.

సిబ్బంది కొరత..
ఆగని దొంగతనాలు

- రైళ్లలో పెరుగుతున్న నేరాలు
- ప్రయాణికుల్లో అభద్రతాభావం
- ఏళ్ల తరబడి వేధిస్తున్న సిబ్బంది కొరత
- ఉన్నవారితోనే కేసుల ఛేదనకు చర్యలు



నెల్లూరు ప్రధాన స్టేషన్‌లో బందోబస్తు విధుల్లో ఉన్న సిబ్బంది (ఫైల్)



సిబ్బంది వివరాలు	డీఎస్పీ	సీఐ	ఎస్సై	ఏఎస్సై	హెచ్‌సీ	పీసీ
మంజూరైన సిబ్బంది	1	2	8	2	18	120
ప్రస్తుతం ఉన్న సిబ్బంది	1	2	6	1	16	77
కొరత	-	-	2	1	2	43

నెల్లూరు(క్రైమ్): సంవత్సరాల తరబడి వేధిస్తున్న సిబ్బంది కొరత.. భర్తీకి నోచుకోని ఖాళీలు.. తలకు మించిన పనిభారం.. ఉదాసీనత.. ఇలా కారణాలెన్నో.. దీంతో రైళ్లలో నేరాల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. నేరగాళ్లు సమయం చూసి పంజా విసురుతూ అందిన కాడికి దోచుకెళ్తున్నారు. దీంతో ప్రయాణికుల్లో అభద్రతాభావం నెలకొంటోంది. సిబ్బంది పెంపు, నిరంతర గస్తీతో నేరాలు కట్టడయ్యే అవకాశం ఉంది. ఆ దిశగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఏ పరిధిలో ఏది?

నెల్లూరు, తిరుపతి, ప్రకాశం, బాపట్ల జిల్లాలు నెల్లూరు రైల్వే సబ్‌డివిజన్ పరిధిలోకి వస్తాయి. ఇక్కడ 444 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ విస్తరించి ఉంది. నెల్లూరు రైల్వే పోలీసు సర్కిల్ పరిధిలో నెల్లూరు, తిరుపతి జిల్లాని గూడూరు, కావలి, సింగరాయకొండ, కొండగుంట, వెంకటగిరి, సూళ్లూరుపేట రైల్వేస్టేషన్లలో రైల్వే పోలీసు స్టేషన్లున్నాయి. సూళ్లూరుపేట, బిట్రగుంట, కృష్ణపట్నం పోర్టులో పోలీసు ఔట్‌పోస్టులున్నాయి. ఒంగోలు రైల్వే పోలీసు సర్కిల్ పరిధిలో ఒంగోలు, బాపట్ల జిల్లాలోని చీరాల రైల్వే పోలీసుస్టేషన్లున్నాయి. సింగరాయకొండలో పోలీసు ఔట్‌పోస్టు ఉంది. నెల్లూరు సబ్‌డివిజన్ పరిధిలో 55 రైల్వే స్టేషన్లున్నాయి. ఇటీవల కాలంలో రైళ్లలో దోపిడీలు, దొంగతనాలు పెరుగుతున్నాయి. పట్టాలపై పలువురు మృతిచెందుతున్నారు. అధికార గణాంకాల ప్రకారం నెలకు రూ 40కుపైగా కేసులు నమోదవుతున్నాయి. అయితే వీటిలో 35 శాతం కేసులు కూడా పరిష్కారానికి నోచుకోవడం లేదు.

నియామకాలెక్కడ?


నెల్లూరు సబ్‌డివిజన్ పరిధిలో 50 రైళ్లు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. రైల్వేలో సిబ్బంది కొరత వెంటాడుతోంది. ఏన్నో ఏళ్లగా రైళ్లు, ప్రయాణికుల సంఖ్యకు తగినట్లు సిబ్బంది నియామకాలు జరగలేదు. జీఆర్పీ నియామకాలు గతంలో కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉండేవి. కాలక్రమేణా ఈ విధానం మారింది. రాష్ట్ర పోలీస్ శాఖ ఎంపిక చేసిన సివిల్ పోలీసులనే డిప్యుటేషన్‌పై రైల్వేకు పంపుతారు. పదవీ విరమణ అయిన వారి స్థానాలతోపాటు డిప్యుటేషన్ ముగిసి తిరిగి సొంతగూటికి వెళ్లిన వారి స్థానంలో ఖాళీలను భర్తీ చేయాలంటే సివిల్ నుంచి పోలీసులను రైల్వేకు పంపాల్సి ఉంది. అయితే ఉన్నతాధికారులు సిబ్బంది కేటాయింపులో తీవ్ర జాప్యం చేస్తున్నారు.

అధికారులు స్పందించాలి

అధికారులు మారిన పరిస్థితులకు అనుగుణంగా ప్రతి పోలీసుస్టేషన్‌కు కేటాయించిన సిబ్బందిని నియమించడమే కాకుండా ఖాళీలను వెంటనే భర్తీ చేయాల్సి ఉంది. తద్వారా నేరాలు తగ్గుముఖం పట్టే అవకాశముంది. అలా కాకుండా ఏదైనా నేరం జరిగిన సమయంలో తాత్కాలికంగా సిబ్బందిని అటాచ్‌మెంట్ చేయడం ద్వారా ఆశించిన ఫలితాలు రావడం కష్టతరమే. నేర నియంత్రణలో సీసీ కెమెరాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. ఎన్నో కేసుల ఛేదనకు ఇవి దోహదపడుతున్నాయి. ప్రధాన స్టేషన్లలోనే కాకుండా నెల్లూరు సౌత్, వేదాయపాళెం, బిట్రగుంట, సీసీ కెమెరాలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉన్న సిబ్బందితోనే విధులు

నెల్లూరు సబ్‌డివిజన్ పరిధిలో 151 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 103 మంది మాత్రమే ఉన్నారు. రైళ్ల సంఖ్య గణనీయంగా పెరిగినా అందుకు సరిపడా సిబ్బంది నియామకాలు జరగడం లేదు. ఒకప్పుడు బ్యాగ్, గొలుసు, జేబు దొంగతనాలు జరిగేవి. ప్రమాదవశాత్తు రైళ్లలో నుంచి ప్రయాణికులు జారిపడడం, పట్టాలు దాటుతూ మృతిచెందడం, ఆత్మహత్యలు ఉండేవి. నేటి పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. నూతన పంథాల్లో నేరాలకు పాల్పడుతున్నారు. దోపిడీలు, దొంగతనాలు, మత్తుమందులిచ్చి ఆభరణాలు, నగదు అపహరణ, సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి దోపిడీలకు పాల్పడడం, మిస్సింగ్ కేసులు అధికమయ్యాయి. వీటితోపాటు గంజాయి, మాదకద్రవ్యాలు, బంగారం, వెండి ఆభరణాల అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా సిబ్బంది విధుల్లోనూ మార్పులు వచ్చాయి. నేర నియంత్రణతోపాటు ఎస్కార్ట్‌లు, కోర్టు, మార్చురీ, రాత్రి, పగలు గస్తీలు నిర్వహిస్తున్నారు ఉన్న వారి పైనే పని భారం అధికమవుతోంది. నేర నియంత్రణ, కేసుల పరిష్కారం వారికి తలకు మించిన భారంగా మారుతోంది. దీంతో ప్రయాణికుల భద్రతపై దష్టిసారించలేకపోతున్నారనే విమర్శలున్నాయి. ఇది నేరగాళ్లకు కలిసొస్తోంది.


ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది (ఫైల్)

వారిపైనే భారం

గతేడాది జూన్ 24వ తేదీన తెట్టు వద్ద సిగ్నల్స్‌ను ట్యాంపరింగ్ చేసి చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో దుండగులు దోపిడీ చేశారు. అదే ఏడాది ఆగస్టు 14వ తేది తెల్లవారుజామున వీరేపల్లి వద్ద చెన్నై ఎక్స్‌ప్రెస్, తెట్టు రైల్వే బ్రిడ్జి వద్ద చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో, సెప్టెంబర్ 16వ తేదీన సింగరాయకొండ వద్ద చెన్నై ఎక్స్‌ప్రెస్‌లో, సెప్టెంబర్ 18న అల్లూరు రోడుడ వద్ద పద్మావతి ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీ జరిగింది. ఇటీవల శ్రీవెంకటేశ్వరపాళెం వద్ద రెండు రైళ్లలో దుండగులు దోపిడీ చేశారు. కేసుల ఛేదనపై రైల్వే పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఉన్న సిబ్బందితోనే రైళ్లలో బీట్లను పెంచడంతోపాటు నేరాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో గస్తీని పెంచారు. రైళ్లలో నేరాలకు పాల్పడే స్థానిక నేరస్తులతోపాటు ఉత్తర ప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ముఠాల కదలికలపై నిఘా ఉంచారు. సాంకేతికత ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశారు. సిబ్బంది కొరత వెంటాడుతున్నా నేరాల కట్టడికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు.


శ్రీవెంకటేశ్వరపాళెం రైల్వేస్టేషన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు దోపిడీకి పాల్పడిన ప్రదేశం (ఫైల్)

క్లుప్తంగా

డీసీపల్లిలో పొగాకు సూర విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో మంగళవారం పొగాకు సూరను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 498 బేళ్లు రాగా కొన్నింటిని వివిధ కారణాలతో తిరస్కరించామన్నారు. వేలంలో 51,656 కిలోల పొగాకును విక్రయించగా రూ.39,26,133ల వ్యాపారం జరిగిందని, ఏడు కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నట్లు వెల్లడించారు.

గురుకులాల్లో పోస్టుల భర్తీకి చర్యలు

నెల్లూరు(వేదాయపాళెం): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 2024 – 25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను గెస్ట్/పార్ట్‌టైం పద్ధతిలో భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టామని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ, జిల్లా కో–ఆర్డినేటర్ హేమలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ మీడియంలో బోధించేందుకు ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు ఈనెల 20వ తేదీన ఉదయం పది గంటలకు పాత జూబ్లీ హాస్పిటల్లోని జిల్లా కో–ఆర్డినేటర్ కార్యాలయానికి తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. అక్కడ డెమో ఆధారంగా ఎంపిక చేస్తామని తెలియజేశారు. టీచింగ్ సిబ్బంది సంబంధిత సబ్జెక్టులో పీజీ, బీఈడీలో ఒక మెథడాలజీ, టెట్ ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. టెట్ పాసైన వారు కుల నిర్ధారణ సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ పోస్టుకు జీఎన్ఎం/బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. బుచ్చిరెడ్డిపాళెం, కండలేరు, కోడూరు, బోగోలు, ఆదూరుపల్లిలో ఖాళీలున్నాయని వెల్లడించారు.

ఎంత చెప్పినా వినకుండా..

- ఆర్టీసీ బస్సును అడ్డుకున్న ప్రయాణికుడు

నెల్లూరు సిటీ: కావలిలో స్టాపింగ్ లేదని చెప్పినా వినకుండా.. తనను అక్కడ వదలాల్సిందేనని ఓ ప్రయాణికుడు ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సును అడ్డుకున్న ఘటన మంగళవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ నుంచి సూళ్లూరుపేట డిపోకు చెందిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు విజయవాడకు బయలుదేరింది. ఈ క్రమంలో బస్టాండ్ బయట ఓ ప్రయాణికుడు దానిని నిలిపి కావలికి వెళ్లాలని చెప్పాడు. డ్రైవర్ ఈ బస్సు కావలిలో ఆగదని, వేరేది ఎక్కాలని సూచించాడు. అయినా అతను వినకుండా బస్సుకు అడ్డుగా నిలబడ్డాడు. దీంతో కొంతసేపు ఆ ప్రాంతంలో గందరగోళం నెలకొంది. బస్టాండ్ అధికారులు అక్కడికి చేరుకుని ఒకటో నంబర్ వద్ద నాన్ స్టాప్ బస్సులుంటాయని సర్ది చెప్పారు.

కండలేరులో 6.429 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం 6.429 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 20, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విహారయాత్రకు వెళ్లొచ్చేసరికి..


వివరాలు తెలుసుకుంటున్న సీఐ రాంబాబు, ఎస్సై రామకృష్ణ

- టీచర్ ఇంట్లో బంగారు ఆభరణాల అపహరణ

పొదలకూరు: పట్టణానికి చెందిన ఓ టీచర్ కుటుంబం విహారయాత్రకు వెళ్లింది. ఇంటికి వచ్చి చూసేసరికి దొంగతనం జరిగి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి కథనం మేరకు.. శ్రీనివాసపురం వీధిలో దొరబాబు అనే టీచర్ నివాసం ఉంటున్నారు. గత శుక్రవారం ఆయన కుటుంబంతో కలిసి విహారయాత్రకు వెళ్లారు. ఊటీ తదితర ప్రదేశాల్లో పర్యటించి మంగళవారం ఉదయం ఇంటికొచ్చారు. మెయిన్ డోర్ పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ ఆర్.రాంబాబు, ఎస్సై రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రెండు సవర్ల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. దుండగులు ఇంట్లోకి ప్రవేశించి కలియ తిరిగి విలువైన బంగారు ఆభరణాల కోసం గాలించారు. కాగా వారు వెండి వస్తువులను ఎత్తుకెళ్లలేదని తెలిసింది. టీచర్ ముందు జాగ్రత్తగా బంగారు ఆభరణాలను బంధువుల ఇంట్లో భద్రపరిచి వెళ్లారు. క్లూస్ టీమ్ ఘటనా స్థలానికి వచ్చి ఆధారాలను సేకరించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెలాఖరులోపు ఆడిట్ ప్రక్రియ పూర్తి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో (పీఏసీఎస్) 2023 – 24 సంవత్సరానికి సంబంధించి ఆడిట్ ప్రక్రియను ఈనెలాఖరులోపు పూర్తి చేయాలని జిల్లా సహకార శాఖాధికారి (డీసీఓ) గుర్రప్ప ఆదేశించారు. నెల్లూరులోని డీసీఓ కార్యాలయం నుంచి మంగళవారం సహకార శాఖ ఆడిటర్లు, డిప్యూటీ ఆడిటర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల చట్టం 1964 సెక్షన్ 50ను అనుసరించి 2023 – 24 ఆడిట్‌ను పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సహకార శాఖ ఆడిట్ అధికారి తిరుపతయ్య, నెల్లూరు, కావలి, కందుకూరు డివిజనల్ సహకార శాఖాధికారులు సుధాభారతి, యలమంద రావు, రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీసీఓ గుర్రప్ప

నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.60
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.30



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 150
లేయర్ (లైవ్)	: 120
బ్రాయిలర్ చికెన్	: 264
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 294
లేయర్ చికెన్	: 204



గరుడ వాహనంపై నృసింహుడి విహారం

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి మంగళవారం చందనాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామివారికి ఉదయం అభిషేకం, చందనాలంకరణ, తర్వాత నిత్యకల్యాణ మండపంలో శాంతిహోమం, 11 గంటలకు కల్యాణం, ఒంటి గంటకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి బంగారు గరుడ వాహనంపై ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో అలంకరించి పెంచలకోనలోని మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.


లక్ష్మీనరసింహస్వామి క్షేత్రోత్సవంలో పాల్గొన్న ఆలయ సిబ్బంది, వేదపండితులు

పేకాట కేంద్రంపై దాడి

నెల్లూరు(క్రైమ్): పేకాట కేంద్రంపై నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో పోలీసు అధికారులు దాడి చేసి జూదరులను అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నగరంలోని నిప్పో సెంటర్‌కు చెందిన సంజీవయ్య నాయుడు నెల్లూరు రూరల్ మండలం అక్కచెరువుపాడులో భవనాన్ని అద్దెకు తీసుకుని కొంతకాలంగా పేకాట కేంద్రం నిర్వహిస్తున్నాడు. దీనిపై నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డికి సమాచారం అందింది. ఆయన నేతృత్వంలో పోలీసులు మంగళవారం దాడి చేశారు. పేకాట నిర్వాహకుడితోపాటు జూదరులు కె.ప్రభాకర్, డి.మోహన్‌రావు, పి.శ్రీనివాసులు, వి.అనిల్ కుమార్, కె.జనార్దన్‌లను అరెస్ట్ చేసి రూ.31,600 నగదు స్వాధీనం చేసుకున్నారు. సంజీవయ్య నాయుడుపై గతంలో పలు కేసులున్నాయని పోలీసులు తెలిపారు. ఈ దాడిలో వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ, డీఎస్పీ ఐడీ పార్టీ సిబ్బంది మణి, సాగర్, గురవారెడ్డి, వెంకటేష్, రామకృష్ణ పాల్గొన్నారు.


విచారిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

పులికాట్ పరిస్థితిపై ప్రజాభిప్రాయ సేకరణ


పత్రాలు అందజేస్తున్న అధికారి

తడ: కోస్టల్ జోన్‌లోని పులికాట్ సరస్సు పరిధి, పరిస్థితి, చేపట్టాల్సిన అభివృద్ధి, అభ్యంతరాలపై జూలై 19వ తేదీన ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు తిరుపతి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనలిస్ట్ కిశోర్ తెలిపారు. మంగళవారం తడ ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పులికాట్ కోస్టల్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌కి సంబంధించి దొరవారిసత్రం మండలంలోని నేలపట్టులో గ్రామసభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం, కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల్లోని తీర ప్రాంత వాసుల నుంచి అభిప్రాయాలు సేకరించి నివేదిక పంపనున్నట్లు వివరించారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శులకు ప్లాన్ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మురళీకృష్ణ, ఎంపీపీ కొళవి రఘురెడ్డి, వైస్ ఎంపీపీ కుప్పంపాటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని పండ్లూరు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో చిట్టేటి చెంగయ్య (72) అనే వృద్ధుడు మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. పండ్లూరు గ్రామానికి చెందిన చెంగయ్య మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి గ్రామ సమీపంలో ఉన్న పొలాల వద్దకు బయలుదేరాడు. పండ్లూరు హైవేపై నడిచి వెళుతున్న చెంగయ్యను నెల్లూరు నుంచి తిరుపతికి వెళ్తున్న నెల్లూరు డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో చెంగయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఏఎస్సై ధర్మయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన బస్సును స్వాధీనం చేసుకుని అందులోని ప్రయాణికులను మరో దాంట్లో తిరుపతికి తరలించారు. వృద్ధుడి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


చెంగయ్య మృతదేహం